క్లుప్తంగా

రేపు తిమ్మోజుపల్లెలో గ్రామసభ

బంగారుపాళెం: మండలంలోని తిమ్మోజుపల్లె సచివాలయంలో గురువారం గ్రామ సభ నిర్వహించనున్నట్లు ఎంపీపీ అమరావతి, ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ×ఏపీకి జగనే ఎందుకు కావాలంటే× కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించనున్నట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు


కాలువ పరిశీలిస్తున్న మేయర్ అముద తదితరులు

చిత్తూరు అర్బన్: నగరంలోని మురుగానిపల్లెలో కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు అందించాలని మేయర్ అముద ఆదేశించారు. మంగళవారం మురుగానిపల్లెలో పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. స్థానికుల విన్నపం మేరకు కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఎల్‌బీఐ రామ్మూర్తి రెడ్డి, లోకేష్‌రెడ్డి, కార్పొరేషన్ డీఈ రమణ, ఏఈ రజని పాల్గొన్నారు.

మరో నాలుగు అతిసారం కేసులు

చిత్తూరు రూరల్: మండలంలోని తుమ్మింద గ్రామంలో మంగళవారం మరో నాలుగు అతిసారం కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే దాదాపు 20 మంది చికిత్స పొందుతుండగా మరో నలుగురు ఆస్పత్రి పాలు కావడంతో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. తేలికపాటి లక్షణాలు కనిపించిన వారిని సైతం వెంటనే వైద్య శిబిరానికి తరలిస్తున్నారు.

నేడు ఆయుర్వేద హెల్త్ క్యాంప్

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆవరణలో బుధవారం తిరుపతి శ్రీవెంకటేశ్వర ఆయుర్వేద కళాశాల వారు ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయుర్వేద వైద్యశిబిరంతోపాటు, ఔషధ మొక్కల సాగు, అవకాశాలపై రైతులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్సీ విరాళం


విరాళమిస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం: శాంతిపురం మండలం దండికుప్పంలో నిర్మిస్తున్న శివాలయానికి చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ లక్ష రూపాయల విరాళాన్ని మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆలయ నిర్మాణకర్తలకు అందజేశారు. ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి తనవంతు సాయం చేసినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో శాంతిపురం వైఎస్సార్ సీపీ నాయకులు పెద్దన్న, జనార్ధన్ పాల్గొన్నారు.

టపాసుల విక్రయానికి లైసెన్సులు తప్పనిసరి

పలమనేరు: టపాకాయలను విక్రయించే వ్యాపారులు విధిగా లైసెన్సులు పొంది ఉండాలని, లైసెన్సు లేకుండా విక్రయిస్తే చర్యలు తప్పవని పలమనేరు ఆర్డీఓ మనోజ్‌కుమార్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. లైసెన్సు రెన్యూవల్ చేసుకోని వారు వెంటనే చేయించుకోవాలన్నారు. ఈ విషయంలో సంబంధిత తహసీల్దార్లు సమగ్ర విచారణ చేసి రెన్యూవల్‌కు సిఫారసు చేయాలన్నారు. టపాకాయల విక్రయించే ప్రాంతాల్లో అన్ని జాగ్రత్తలను పాటించాలన్నారు.

అంత్యక్రియలకు రూ.10వేలు పంపిణీ

పలమనేరు: పట్టణంలోని పాతపేటకు చెందిన గుల్బర్ ఆకస్మిక మరణంతో ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా ద్వారా అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలను వార్డు కౌన్సిలర్ హైదర్, సచివాలయ సిబ్బందితో కలసి మంగళవారం అందజేశారు. త్వరలో వీరికి వైఎస్సార్ బీమా పథకం కింద మొత్తం రూ.లక్షసాయం అందుతుందని వారు తెలిపారు. సచివాలయ అడ్మిన్ సౌజన్య, వెల్ఫేర్ అసిస్టెంట్ మురగేష్ పాల్గొన్నారు.

దుకాణాలకు జరిమానా

పలమనేరు: పట్టణంలోని పలు దుకాణాలను స్థానిక వార్డు సచివాలయాల శానిటరీ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది మంగళవారం తనిఖీలు చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడుతున్న దుకాణాలకు రూ.4వేల చొప్పున జరిమానా విధించారు.

మాల ధారణం.. నియమాల తోరణం!

అయ్యప్ప సేవకు భక్తులు ఏడాది పొడవునా ఎదురుచూస్తుంటారు. ముఖ్యంగా అక్టోబర్ నుంచి ఎక్కువ మంది మాలధారణకు మొగ్గుచూపుతుంటారు. భజనలు.. పడి పూజలతో హరిహర సుతుడిని కీర్తిస్తూ దీక్షాబద్ధులు పరవశిస్తుంటారు. మండలంపాటు కఠిన నియమాలు పాటించి శబరిమలై యాత్రకు బయలుదేరుతుంటారు. శిరస్సుపై ఇరుముడి ధరించి సన్నిధానం చేరి స్వామి దర్శనంతో మొక్కులు చెల్లించుకుంటారు.

- అయ్యప్ప దీక్షతో మానసిక ప్రశాంతత
- మండలంపాటు కఠిన నిష్ఠలతో పూజలు
- స్వామి సేవతో పరివర్తన.. ఆధ్యాత్మిక చింతన
- శబరిమలై యాత్రకు అందుబాటులో బస్సులు

చిత్తూరు రూరల్: నియోజకవర్గంలో అయ్యప్పస్వామి భక్తుల సంఖ్య ఏటా పెరుగుతోంది. తమిళ నెల పాటించే భక్తులు కార్తీకమాసం ప్రారంభానికి ముందే అయ్యప్ప మాలలు ధరిస్తుంటారు. ఇప్పటికే వెయ్యి మందికి వరకు మాలలు ధరించగా, ఏటా నియోజకవర్గంలో 10వేల మందికి పైగా భక్తులు మాల ధరించి దైవ భక్తిని చాటుకుంటున్నారు. దీక్ష శిబిరాలు ఏర్పాటు చేసుకుని రాత్రి, ఉదయం స్వామి గీతాలాపనలు, శరణం అయ్యప్ప నామస్మరణాలతో పులకిస్తున్నారు. స్వాములకు అన్నదానం చేస్తున్నారు. దీంతో కార్తీకమాసమంతా అయ్యప్పస్వామి భక్తులతో ఆలయాలు, మండపాలు కిటకిటలాడుతుంటాయి. భక్తి భావంతో నిండిపోతుంటాయి.

అపారమైన భక్తితో....

సుమారు 40 నుంచి 45 రోజుల పాటు కఠిన బ్రహ్మచర్యం, నియమ నిష్ఠలతో ఆచరించే అయ్యప్ప దీక్ష శారీరక ఆరోగ్యాన్నే కాకుండా మానసిక ప్రశాంతతను చేకూరుస్తుంది. మనిషిలో సత్ప్రవర్తనను మేల్కొలిపి క్రమశిక్షణకు బాటలు వేస్తుంది. సాత్విక ఆహారం, అందరినీ సమానంగా చూడడం వంటి నిబంధనలు దీక్షధారుల వ్యక్తిత్వాన్ని ఉత్తేజపరుస్తాయి. అయ్యప్ప మాల ధరించిన స్వాములు 40 నుంచి 45 రోజుల పాటు కఠోర దీక్షను పూర్తి చేసుకుని ఇరుముడి కట్టి అనంతరం అయ్యప్ప కొలువై ఉన్న శబరిమలై వెళుతుంటారు. అయితే కొంత మంది సదుంలోని అయ్యప్పస్వామి ఆలయం, చిత్తూరులోని శాస్త్రగిరి అయ్యప్పస్వామి ఆలయాలకు వెళ్లి దీక్షను ముగిస్తున్నారు. దీక్ష సమయంలో ఆరోగ్యపరమైన రహస్యాలు నిండి ఉన్నాయని గురుస్వాములు చెబుతారు.

చన్నీటి స్నానంతో ఉత్తేజం...

ఉదయం, సాయంత్రం చన్నీటి స్నానం చేయడంతో శరీరంలో శక్తి, ఏకాగ్రత, ఉత్తేజం పెరుగుతాయని చెబుతారు. చన్నీటితో తలస్నానం చేయడం వల్ల రక్తపోటు తగ్గి జీర్ణశక్తి అభివృద్ధి చెందుతుంది.

చందనంతో చల్లదనం

నుదుటిపై చందనం, కుంకుమ, విభూతి ధరించడం వల్ల చల్లదనంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతాయి. కాళ్లకు చెప్పులు లేకుండా నడవడంతో చిన్న చిన్న రాళ్లు పాదాలకు తగిలి నరాలకు స్పందన కలుగుతుంది.


అయ్యప్ప మెట్ల పూజ నిర్వహిస్తున్న భక్తులు (ఫైల్)

నల్లని వస్త్రాలతో వెచ్చదనం

శీతాకాలంలో స్వాములు నల్లటి వస్త్రాన్ని ధరిస్తారు. నల్లటి వస్త్రాలు వెచ్చదనాన్ని ఇస్తాయి. చలికాలంలో నల్లటి వస్త్రాలు శరీరానికి ఉపకరిస్తాయి. అలాగే భక్తులు శని ప్రభావానికి లోను కాకుండా ఉండేందుకు కూడా నల్లని వస్త్రాలు ధరిస్తారు.

ఆధ్యాత్మికం.. ఆరోగ్యం

మండల దీక్ష చేపట్టడం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్యం లభిస్తుంది. 40 నుంచి 45 రోజుల పాటు చన్నీటి స్నానం, ఒంటి పూజ భోజనం, దేవతారాధన మాలధారుల జీవితాలపై చక్కటి ప్రభావం చూపుతాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

ఆర్టీసీ ముందస్తు బుకింగ్‌లు

అయ్యప్పస్వామి మాలధారణ ప్రారంభకావడంతో ఆర్టీసీ అధికారులు శబరిమల యాత్రకు ప్రత్యేక బస్సులు కేటాయించారు. రాయితీలను కూడా అందిస్తున్నారు. సురక్షితంగా ప్రయాణం సాగేలా రోడ్డు మార్గాలతో ముందస్తు ప్రణాళికలతో భక్తులకు ఆకట్టుకుంటున్నారు. కోరుకుంటే ఊరికే బస్సు పంపించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

కొత్తగా మాల వేశా



అయ్యప్ప స్వామి దీక్ష చేపట్టడం ద్వారా మంచి ఆరోగ్యం చేకూరుతుంది. మనసు ఉత్తేజంగా ఉంటుంది. కొత్తగా అయ్యప్పమాల ధరించా. ఇప్పటికి 20 రోజులు పూర్తయింది. మొత్తం 41 రోజులపాటు దీక్ష చేపడుతా.
– దేవిప్రసాద్, చిత్తూరు

విశ్వాసంతో దీక్ష



దారి తప్పుతున్న జీవితాల్ని తీర్చిదిద్దేందుకు అయ్యప్ప దీక్ష ఎంతో దోహదపడుతుంది. చెడు అలవాట్లను దూరం చేస్తుంది. ఆధ్యాత్మిక చింతన, దృఢ సంకల్పం, స్వామిపై విశ్వాసంతో దీక్ష చేపడితే అయ్యప్ప కృపకు పాత్రులు కావచ్చు. నేను ఎనిమిదోసారి మాల ధరించా.
– త్యాగరాజులు, గురుస్వామి, గుడిపాల

పల్లెలు పరిఢవిల్లేలా 'పాల వెల్లువ'


సూచనలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

పూతలపట్టు: పాల వెల్లువతో పల్లెలు పరిఢవిల్లేలా ప్రభుత్వం పకడ్బందీగా కృషి చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని పోలవరంలో నిర్మిస్తున్న పాలశీతలీకరణ భవనాన్ని ఆయన పరిశీలించారు. నెలాఖరులోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు పాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపడుతున్నామన్నారు. పాల లభ్యత అధికంగా ఉండే గ్రామాల్లో మహిళా డెయిరీ సహకారం సంఘాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పశుసంవర్ధశాఖ జేడీ ప్రభాకర్, పంచాయతీరాజ్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీఓ గౌరి, పీఆర్‌ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

పక్కాగా నీటి వనరుల గణన


మాట్లాడుతున్న తహసీల్దార్ మురళీమోహన్

చిత్తూరు రూరల్: మండలంలో నీటి వనరుల గణనను పక్కాగా పూర్తి చేయాలని తహసీల్దార్ మురళీ మోహన్ ఆదేశించారు. మంగళవారం నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. నీటి వనరుల గణనపై శిక్షణ ఇచ్చారు. చెరువులు, ఊట చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లను గుర్తించి గణన చేయాలన్నారు. వాటి సర్వే నంబరు, పేరు, ఆయకట్టు విస్తీర్ణం, వాటి కింద సాగవుతున్న పంట వివరాలు తదితర అంశాలను వీఆర్‌ఓలు విధిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. సేకరించిన వివరాలను గణన యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈనెల 10వతేదీ లోపు గణన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ సౌందర్‌రాజన్ పాల్గొన్నారు.



అధికారుల నిర్వాకం.. అడ్డంగా కూలిన వృక్షం!

బంగారుపాళెం మండలం అండారెడ్డిపల్లె వద్ద సోమవారం తగ్గువారిపల్లె పంచాయతీ అధికారులు మురుగునీటి కోసం జేసీబీతో పెద్ద గుంతను తవ్వించారు. అయితే పక్కనే భారీ వృక్షం ఉన్న సంగతి మరిచారు. ఇంకేముందు ఇటు గుంత తీయగానే అటు చెట్టు కాస్తా ఒరిగిపోయింది. అప్పటికే అధికారుల్లో నిర్లక్ష్యపు మత్తు వదలకపోవడంతో భారీ వృక్షం సాంతం పడిపోయింది. ఇంతకీ ఈ చెట్టు చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిపై కూలడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. చెట్టు పడే సమయంలో అక్కడే నిలబడి ఉన్న అనసూయ అనే మహిళ గాయపడింది. సమీపంలోని విద్యుత్ స్తంభం విరిగిపోయింది. అంతా అయిన తర్వాత అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన చెట్టును తొలగించారు. వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు.

–బంగారుపాళెం

విద్యార్థులకు ఆటల పోటీలు


కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

సదుం: రానున్న బాలల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, రన్నింగ్, వాలీబాల్, బాలికలకు గన్నీబ్యాగ్ పోటీలను పీడీలు కిశోర్‌కుమార్, రెడ్డి ప్రవీణ్ నిర్వహించారు. విజేతలకు ఈనెల 14న బహుమతులు అందజేస్తామని హెచ్‌ఎం సుబ్రమణ్యం చెప్పారు.

పరిశుభ్రతపై అవగాహన

చిత్తూరు రూరల్: మండంలోని తుమ్మింద జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డయేరియా వ్యాప్తికి గల కారణాలను ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది తెలియజేశారు. పిల్లలు తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేంద్రుడు, అమర్‌నాథ్, ఈశ్వరి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ


చెక్కు అందిస్తున్న, బాబునాయుడు

చిత్తూరు రూరల్: నగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సీఎం సహాయనిధి చెక్కును జెడ్పీటీసీ సభ్యుడు ఎంఎస్ బాబునాయుడు చేతులమీదుగా లబ్ధిదారుడికి అందజేశారు. తాళంబేడు పంచాయతీ మిట్టూరు గ్రామానికి చెందిన సుబ్రమణ్యంరెడ్డి కుమారుడు పూర్ణచంద్రారెడ్డికి ఇటీవల కిడ్నీ మార్పిడి చికిత్స జరిగింది. ఈ మేరకు ఆయన సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.5లక్షలు మంజూరైంది.

పేదలందరికీ మెరుగైన వైద్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ధాత్రేయచౌదరి, ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

తవణంపల్లె: పేదలందరికీ మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు చేస్తోందని తవణంపల్లె వైద్యాధికారులు ధాత్రేయ చౌదరి, వినయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని కె.పట్నం, చెర్లోపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. 79 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుండ్లపల్లెలో..

ఐరాల: మండలంలోని గుండ్లపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత 104 వాహనంలో 95 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుగుణవతి, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, పీహెచ్‌ఎన్ జీవకళ పాల్గొన్నారు.


గుడిపాల : రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి పవన్

గుడిపాలలో..

గుడిపాల: గ్రామీణ ప్రాంతాల్లోని రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నట్లు 104 వైద్యాధికారి పవన్ తెలిపారు. మంగళవారం గుడిపాలలో ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పల్లెవాసుల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది సోనియా, సింధు, ప్రవీణ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


గుడిపాల: మాట్లాడుతున్న డాక్టర్ శేషగిరిరావు


తవణంపల్లె పీహెచ్‌సీలో ఆశా వర్కర్ల సమావేశం

గుడిపాల: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, గ్రామీణ ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని వైద్యాధికారి శేషగిరిరావు తెలిపారు. మంగళవారం గుడిపాల పీహెచ్‌సీలో ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. గర్భిణుల వివరాలను పక్కాగా అందించాలన్నారు. బాలింతలకు పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. సీహెచ్‌ఓ నరసింహమూర్తి పాల్గొన్నారు.

నవజాతి శిశువుల సంరక్షణ

తవణంపల్లె: నవజాతి శిశువుల సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. మంగళవారం తవణంపల్లె పీహెచ్‌సీలో ఆశా డే సమావేశం నిర్వహించారు. ప్రియాంక మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. 18 ఏళ్లు పైబడిన వారికి బీసీజీ వ్యాక్సిన్లు వేయించాలని సూచించారు. అనంతరం హెచ్‌వీఎన్‌సీ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్‌వేలు పాల్గొన్నారు.


యాదమరి : మాట్లాడుతున్న వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్

లక్ష్యసాధనలో ముందడుగు

యాదమరి: వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తమ లక్ష్యసాధనలో ముందడుగు వేయాలని సంతగేటు ప్రభుత్వాస్పత్రి వైద్యుడు అనిల్‌కుమార్ నాయక్ సూచించారు. మంగళవారం మండలంలోని ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని కోరారు. జాతీయ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలూ అవసరం


ప్రతిభ చాటిన విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలూ అవసరమని విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి తెలిపారు. మంగళవారం విజయం సీబీఎస్‌సీ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14,17 క్యారమ్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పలు మండలాల నుంచి సర్కారు, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. తేజోమూర్తి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చాటిన బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డైరెక్టర్ శైలజా, క్రీడా సెక్రటరీ సురేష్, పీడీ పాండ్యన్ పాల్గొన్నారు.

రాహుకాల పూజలు


సుబ్రమణ్యస్వామివారు

రామకుప్పం: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో మంగళవారం భక్తిప్రపత్తులతో రాహుకాల పూజలు చేశారు. ప్రత్యేక అభిషేకం అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. బెంగళూరుకు చెందిన వినయ్‌కుమార్ ఉభయకర్తగా వ్యవహరించారు.